క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, అచ్చియ్యపాలెం, చీపురుపల్లి, దేవీపట్నం మండలం నేలకోట గ్రామాలకు బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

నేటి నుంచి వేసవి సెలవులు

కోరుకొండ: వేసవి సెలవులు బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకూ ప్రకటించినట్టు ఎంఈఓ టి.కుశలవదొర తెలిపారు. కోరుకొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 13,732 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరంతా సెలవుల అనంతరం పాఠశాలలకు రావాలని తెలిపారు.

తల్లితోనే బిడ్డ ఆరోగ్య సంరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమారి

రాజానగరం: పిల్లల ఆరోగ్య సంరక్షణ తల్లులపైనే ఆధారపడి ఉందని జిల్లా మహిళా సాధికారత అధికారి, జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.విజయకుమారి అన్నారు. గర్భిణులు, చిన్నారుల సంరక్షణ కోసం అమలు చేస్తున్న పోషణ్ పఖ్వాడపై అవగాహన, ముగింపు కార్యక్రమాన్ని స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలు తదితర వాటిపై అవగాహన కలిగించారు. జానపద కళాజాత కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. రాజానగరం సీడీపీఓ టి.నాగమణి, సహాయకురాలు టి.కనకవల్లి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


రంగంపేట ఊర చెరువులో అక్రమ నిర్మాణాలు

రంగంపేట: గ్రామంలో చెరువులు, స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి హెచ్చరించారు. గ్రామంలో కొందరు వ్యక్తులు స్థానిక ఊర చెరువును ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పంచాయతీ సిబ్బందితో ఆయా నిర్మాణాలను తొలగించారు. ఇకపై ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఓ స్టూడెంట్.. అర డజను ఏజెంట్లు



- టెన్త్ రాసిన విద్యార్థుల కోసం జల్లెడ
- ప్రైవేటు జూనియర్ కాలేజీల విశ్వప్రయత్నాలు
- ఇంటింటినీ చుట్టుముడుతున్న సిబ్బంది
- తమ కాలేజీలోనే చేర్చాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి

బిక్కవోలు: మా కాలేజీలో చదివితే మీవాడు ఇంజినీరు కావడం ఖాయం.. మా కాలేజీలో చేర్పించండి.. మీ అమ్మాయిని డాక్టరు చేసే బాధ్యత మాది.. మీ పిల్లలు ఏం కావాలనుకున్నా.. ఆ కోర్సులో మా కాలేజీయే టాప్.. నిత్యం పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లల్లో ఇదే చర్చ జరుగుతోంది. ఆయా ప్రైవేటు కళాశాలల ఏజెంట్లు.. విద్యార్థుల చిరునామాలను సేకరించి, వారిళ్లకు వెళ్లి చిన్నాపెద్దా తేడా లేకుండా ఊదరగొడుతున్నారు. అరచేతిలో వైకుంఠం చూపెడుతూ.. తల్లిదండ్రులను పగటి కలల్లోకి నెట్టేస్తున్నారు. రిజల్ట్స్ వచ్చాక చూద్దామని చెబుతున్నా వారు ఊరుకోవడం లేదు. అబ్బాయి/అమ్మాయి చక్కగా పాసవుతారు. కాలేజీ విద్య ఎంతో కీలకం. ఇంటర్‌లో మంచి కాలేజీ ఎంచుకోకపోతే భవిష్యత్తులో నష్టపోతారంటూ తల్లిదండ్రులను భయపెడుతున్నారు. కౌన్సెలింగ్ అంటూ లేనిపోని భయాలను సృష్టించి, వారిని తమ దారిలోకి తెచ్చుకునేందుకు శతవిధాలా యత్నిస్తున్నారు. చివరకు విద్యార్థులు ఏ సామాజిక వర్గానికి చెందినవారో తెలుసుకుని, అదే వర్గానికి చెందిన ఏజెంట్లను రంగంలోకి దించి తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు సైతం కళాశాలల యాజమాన్యాలు వెనుకాడడం లేదంటే పరిస్థితి ఏ మేరకు దిగజారిందో అవగతమవుతోంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఎంతలా నమ్మిస్తారో.. అంతకంటే ఎక్కువగా విద్యార్థుల తల్లిదండ్రులను బుట్టలో వేసుకునేందుకు యత్నిస్తున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించినట్టుగా.. వారిని పగటి కలల్లో తేలుస్తున్నారు. గ్రామాల వారీగా ఏజెంట్లు పనిచేస్తుండగా, మరోవైపు ఆయా కళాశాలల నుంచి తల్లిదండ్రులకు నేరుగా ఫోన్లు కూడా వస్తున్నాయి. తమ కళాశాలలో చేర్పించాలని, ముందుగానే సీటు బుక్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ హామీలు గుప్పిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు విసిగిపోతున్నారు. పలు ప్రైవేట్ కళాశాలలు కొన్నిచోట్ల భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి.

సిబ్బందికి టార్గెట్లు

ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసే వారికి వేసవి సెలవులు ఇవ్వకపోగా, విద్యార్థులను చేర్పించాలంటూ టార్గెట్లు నిర్దేశిస్తున్నారు. కొత్త అడ్మిషన్లు తీసుకురావాలని, లేకపోతే ఉద్యోగం ఉండదని ఒత్తిడి చేస్తున్నారు.అడ్మిషన్లు తీసుకువచ్చిన వారికీ కమీషన్లు ఇస్తామని ఆశ చూపెడుతున్నారు. దీంతో ఆయా కళాశాలల సిబ్బంది తమ బంధువులు, స్నేహితుల సాయంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

కళాశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించడానికి ముందుగా ఆ కళాశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అక్కడి వాతావరణం తమ పిల్లలకు అనుకూలంగా చూసుకోవాలి,అక్కడ ఉపాధ్యాయులు,గతంలో అక్కడ సాధించాన ప్రగతి గమనించా చేర్పించాలి, చదువుతో పాటు ఆటలు కూడా ఉంటే ఆరోగ్యకమైన విద్య వస్తుంది.

– పడాల గరెటారెడ్డి,
విశాంత్ర ఉపాధ్యాయుడు, పందలపాక

అయోమయంలో తల్లిదండ్రులు

టెన్త్ ఫలితాలు రాకుండానే ప్రైవేటు కాలేజీల ఒత్తిడి పెరిగిపోతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయంలో పడిపోతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఏ కాలేజీలో చేర్పించాలో తెలియక సతమతమవుతున్నారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో పదో తరగతి పరీక్షలు రాసిన 2,815 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఐదు ప్రైవేటు కళాశాలలు, తొమ్మిది ప్రభుత్వ కళాశాలలున్నాయి. ఇవేకాకుండా పొరుగు నియోజకవర్గంతో పాటు, రాజమహేంద్రవరం, కాకినాడ, రామచంద్రపురం, మండపేటల్లోని కళాశాలలకు చెందిన ఏజెంట్లు ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థుల చిరునామాలు సేకరించి, మారుమూల గ్రామాల్లో సైతం వారిళ్లకు వెళుతున్నారు. పిల్లలను చేర్పించాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆకర్షణీయమైన బ్రోచర్లతో బుట్టలో వేసేందుకు యత్నిస్తున్నారు.

పొలాల్లో మట్టి అక్రమ తవ్వకాలు!


వడిశలేరులో మట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న పొక్లెయిన్

రంగంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా పొలాల మట్టి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మండలంలోని వడిశలేరు గ్రామంలో రేయింబవళ్లు తేడా లేకుండా టాక్టర్లు, పొక్లెయిన్లతో పొలాల మట్టిని తరలిస్తున్నారు. ఏ అవసరానికైనా మట్టి తరలించాలంటే మైనింగ్ శాఖ అనుమతులు తీసుకోవాలి. ఎలాంటి అనుమతులు పొందకుండానే మట్టిని తరలించడమే గాక, తెల్లవార్లు గ్రామంలో ట్రాక్టర్లతో రొద చేస్తుంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, వీరిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజమ్మాయి సేవలు అభినందనీయం


రాజమ్మాయి, రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: ఉపాధ్యాయురాలు రాజమ్మాయి సేవలు అభినందనీయమని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కోలా సత్యనారాయణ కొనియాడారు. మంగళవారం బొబ్బిల్లంక హైస్కూల్లో హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ రాజమ్మాయి ఉద్యోగ విరమణ, అభినందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 37 ఏళ్లుగా వివిధ హోదాల్లో ఆమె విద్యారంగానికి అమూల్యమైన సేవలు అందజేశారని కొనియాడారు. ఆమె శిష్యులు అనేక మంది దేశవిదేశాల్లో మంచి స్థాయిలో ఉన్నారని చెప్పారు. అనంతరం రాజమ్మాయి, రామకృష్ణ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ సుందరరావు, ఈశ్వరరావు, దయామణి, ఉల్లి రామకృష్ణ, ఎస్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

‘నన్నయ’లో నీడ గడియారం ఏర్పాటు


నీడ గడియారాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో సమయాన్ని తెలియజేసే చాళుక్య ద్వారం వద్ద ఉన్న సన్ డయల్ (నీడ గడియారం)ని మంగళవారం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. పూర్వీకులు సమయాన్ని నీడ ద్వారానే తెలుసుకునేవారన్నారు. దీనిని నీడ గడియారం లేదా పలభా యంత్రం అని కూడా పిలుస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్నవరం, ద్రాక్షారామలో ఈ గడియారం ఉందని, తర్వాత నన్నయ విద్యార్థులే దీనిని ఏర్పాటు చేశారన్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సూర్య గమనంతో ఈ యంత్రంపై పడే నీడ ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఫిజిక్స్ అధ్యాపకులు వి.రాజశేఖర్, బయో టెక్నాలజీ అధ్యాపకులు ఎస్.మురళీమోహన్ సహకారంతో విద్యార్థులు బి.శ్యామలాదేవి, పి.కావ్య తనుశ్రీరెడ్డి, కె.బిందుప్రియ, ఎన్.దుర్గాభవాని, కె.జయప్రశాంత్ ఈ నీడ గడియారాన్ని తయారుచేశారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం


మొక్కలు నాటుతున్న అధికారులు

రాజానగరం: ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంతో పాటు, వృక్ష సంపదను కాపాడటం, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి చిన్న చర్యలే భవిషత్తును కాపాడగలవని జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దామా అన్నారు. ఛాలాచెరువు రిజర్వు ఫారెస్టులోని గోదావరి మహా పుష్కర వనంలో ధరిత్రి దినోత్సవాన్ని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమిపై అన్నింటికీ ఆధారపడుతున్న ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారన్నారు. కశ్మీర్, కేరళ, విజయవాడ, తమిళనాడు తదితర ప్రాంతాలలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను ప్రస్తావిస్తూ ఇవన్నీ ప్రజల నిర్లక్ష్యం ఫలితాలేనన్నారు. పర్యావరణ హితంగా ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనే విషయాన్ని అంతా గ్రహించాలన్నారు. ఈ సందర్భంగా పుష్కర వనంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఎంఆర్ గౌతమ్, డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్, అటవీ శాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వసుంధర


సీతానగరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ వసుంధర

సీతానగరం: గ్రామాలన్నీ క్షయ రహితంగా మారేలా కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వసుంధర పీహెచ్‌సీ సిబ్బందికి నిర్దేశించారు. మంగళవారం ములకల్లంకలో విపత్తుల నిర్వహణ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. అదే గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులను కలిసి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యారోగ్య సిబ్బంది అండగా ఉండి, వారికి పౌష్టికాహారం అందించాలని ఆమె కోరారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ ఏసురాణి, డాక్టర్ సునీల్, డాక్టర్ మనోజ్, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, వీర్రాజు, డీపీఎస్ సుందరి ఉన్నారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న దానవాయిపేటలో క్రిస్టల్ స్పా సెంటర్‌పై సోమవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ స్పాసెంటర్‌లో బ్యూటీషియన్ కోర్సులు నేర్పిస్తామని యువతులకు ఎర వేస్తున్నారు. ఇలా చేరిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ ఎస్సై ఆదినారాయణకు వచ్చిన సమాచారం మేరకు, సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు యువతులు, ఇద్దరు విటులు పట్టుబడ్డారు. అక్కడ రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకుని, స్పా నిర్వాహకుడు మదన్, మేనేజర్ తేజశ్రీ, రిసెప్షనిస్ట్ రాజును అరెస్టు చేశారు. ఎస్సై ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలుపెరగని పోరాటం చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

కోరుకొండ: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడానికి కార్యకర్తలు ముందుండాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక హరేరామ సమాజంలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ జయంతిని నిర్వహించారు. పార్టీ నాయకుడు పల్లాల వెంకటనాయుడు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, పెట్టుబడిదారీ సమాజంలో మానవ సేవలు లేవన్నారు. అందుకే ప్రపంచంలో యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సూపర్‌సిక్స్ అమలు జరపకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతి పేరిట కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల ఆస్తుల వృద్ధికి చంద్రబాబు కృషి చేస్తారన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టు నాయకులు, నక్సలైట్లను ఎన్‌కౌంటర్ పేరిట హత్యలు చేస్తున్నట్టు ఆరోపించారు. తొలుత ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు ఏవీ రమణ, జె.సత్తిబాబు, రాఘవులు పాల్గొన్నారు.

విపత్తులు సంభవిస్తే..

ములకల్లంకలో వివిధ శాఖల మాక్‌డ్రిల్


అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షిస్తూ..

సీతానగరం: ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన తీరుతెన్నులపై ములకల్లంకలో నిర్వహించిన మాక్‌డ్రిల్ ప్రజలను ఆకట్టుకుంది. మంగళవారం మండలంలోని ములకల్లంక గోదావరి ఒడ్డు ప్రాంతంలో విపత్తుల నిర్వహణ శాఖతో పాటు పలు శాఖల వారు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రకృతి విపత్తుల సమయాల్లో ఎలా సేవలందిస్తారు, వైద్య సేవలు, ఇతర కార్యకలాపాలను క్షుణ్ణంగా వివరించారు. ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్, మాక్‌డ్రిల్ నోడల్ ఆఫీసర్ భాస్కరరెడ్డి, ఇన్సిడెంట్ కమాండర్‌గా తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కృష్ణనాయక్ మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించడం, వివిధ శాఖలను అప్రమత్తం చేయడం కోసం మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు చెప్పారు. వరదలో కొట్టుకుపోతున్న వారిని ఎలా రక్షిస్తారో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. అలాగే అపస్మారక స్థితిలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించడం, దొంగతనాలపై అప్రమత్తంగా ఉండడం, అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడడం, గుండెపోటు వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించడం వంటివి ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై మహిళా–శిశు సంక్షేమ శాఖ అధికారులు విశ్లేషించారు. పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్, ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, ఫిషరీస్, రవాణా శాఖలు, విమానయానం విభాగం వారు మాక్‌డ్రిల్‌లో పలు విన్యాసాలు చేశారు. నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎంపీడీఓ ఎం.భారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణనాయక్


రోగికి వైద్య సేవలందిస్తూ..


వరదలో కొట్టుకుపోతున్న వారిని కాపాడుతూ..

